క్లుప్తంగా

విద్యుత్ బకాయిలు వసూలు చేయండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని అన్ని పంచాయతీలకు సంబంధించిన విద్యుత్ బకాయిలను వెంటనే వసూలు చేయాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్ నుంచి జిల్లా విద్యుత్ అధికారులతో బుధవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదలయ్యాయని చెప్పారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ జనవరి వరకు విద్యుత్ బకాయిలు ఉన్న పంచాయతీలకు ఇప్పటికే నోటీసులను ఇచ్చి, ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రాన్ని అందజేశామని వివరించారు. అధికారులు అలసత్వం వహించకుండా జిల్లాలో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్న పంచాయతీల సెక్రటరీలను కలిసి వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు.

ఉత్సాహంగా సైన్స్ ఎక్స్‌పో

నెల్లూరు(బారకాసు): అల్లీపురంలోని షిర్డీ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో షిర్డీ స్టెమ్ ఎక్స్‌పోను బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ రామ్మోహన్, పవన్‌కుమార్ రెడ్డి, రామాలయ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి హాజరయ్యారు. దాదాపు 120 నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. కరస్పాండెంట్ కృష్ణచైతన్య, ప్రధానోపాధ్యాయురాలు నీరజ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రదర్శనలతో విద్యార్థుల్లో ఆసక్తి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సైన్స్ ప్రదర్శనలతో విద్యార్థుల్లో ఆసక్తి కలుగుతుందని పీహెచ్‌పీ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్ పేర్కొన్నారు. బుజబుజనెల్లూరులోని శేషు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో సైన్స్ ఫెయిర్‌ను కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కోశాధికారి శ్రీనివాసులు, పాఠశాల కరస్పాండెంట్ ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతి చెందిన ఘటన మాగుంట లేఅవుట్లోని అండర్ బ్రిడ్జి వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మృతదేహం తల పగిలి పూర్తిగా గుర్తుపట్టలేని విధంగా తయారైంది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాల కోసం ఆరాతీస్తున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ముత్తుకూరు : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని ముత్తుకూరులోని మత్స్యకళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ అన్నారు. తాళ్లపూడిలో తలపెట్టిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్‌లో భాగంగా బుధవారం సైన్స్ దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలో మొక్కలు నాటారు. గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేసి, సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డాక్టర్ మాధవన్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ, పర్యావరణ హితంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు త్రివేణి, శ్రీవిద్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఇందుకూరుపేట : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని కొమరిక గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొమరికకు చెందిన చిన్న బైక్‌పై రావూరు వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో కూడలి వద్ద ఎదురుగా వస్తున్న చేపల వ్యాన్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు గుర్తించి నెల్లూరుకు తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై వీరేంద్ర బాబు తెలిపారు.

గజవాహనం బహూకరణ

పొదలకూరు : స్థానిక శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి గొడవర్తి అశోక్‌నాయుడు-సునీత దంపతులు స్వామివారికి రూ.2 లక్షల విలువైన గజవాహనాన్ని బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి, అమ్మవార్లకు గజవాహనం సమర్పించడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఉపాధ్యక్షుడు కోనం చినబ్రహ్మయ్య, సభ్యులు చొప్పా వెంకటేశ్వర్లు, దేవరం రఘురామిరెడ్డి, కృష్ణయ్యనాయుడు, కుంకు సురేష్, శ్రీనివాసులురెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో రోగాలు నయం

కోవూరు : ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని ఆయుర్వేదిక్ వైద్యుడు గంగాధర్ అన్నారు. కోవూరులోని ఆయుర్వేదిక్ వైద్యశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆయుర్వేదంలో అనేక దీర్ఘకాలిక రోగాలను నయం చేసే చికిత్స, మందులు ఉన్నాయన్నారు. కేన్సర్‌కు కూడా ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయని, పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

నగరాభివృద్ధికి పెద్దపీట

- నగరపాలక సంస్థ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం
- మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు
- రూ.437.01 కోట్లతో వార్షిక బడ్జెట్


సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులను ప్రణాళికబద్ధంగా నిర్వహించేలా నూతన బడ్జెట్‌ను రూపొందించామని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో 2024 – 25 వార్షిక బడ్జెట్ సమావేశాన్ని మేయర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. బడ్జెట్‌లో పొందుపర్చిన అంశాలను అకౌంటెంట్ విశ్వనాథం చదివి వినిపించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నగరపాలక సంస్థ బడ్జెట్‌ను రూపొందించామని మేయర్ స్రవంతి తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ కేటాయింపులు జరిపామని, అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తామని వెల్లడించారు. తమ డివిజన్లలో నెలకొన్న సమస్యలపై గళాన్ని పలువురు కార్పొరేటర్లు వినిపించారు. చిన్న సమస్యలను సైతం పరిష్కరించడంలేదని చెప్పారు. గత వార్షిక బడ్జెట్, కౌన్సిల్ సమావేశాల్లోనూ కార్పొరేటర్లు వివిధ సమస్యలను లేవనెత్తారని, అయినా ఇప్పటి వరకు ఎలాంటి మార్పు లేకపోవడం ఏమిటని కమిషనర్‌ను మేయర్ ప్రశ్నించారు. ఇకపై కార్పొరేటర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావడానికి వీల్లేదని చెప్పారు. వీరందరూ సంతృప్తి పొందేలా తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

ఎవరెవరు ఏమన్నారంటే..

⇨ బడ్జెట్‌లో నిధులు పుష్కలంగా ఉన్నాయని, వీటిని ఏ విధంగా ఖర్చు చేస్తారనే అంశాలను తెలియజేయాలని 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి కోరారు. తనతో పాటు అనేక మంది కార్పొరేటర్లకు పలు అంశాలపై అవగాహన లేదని, ఈ విషయమై అవగాహన కల్పించాలని కోరారు.

⇨ పూర్తి చేసిన పనులకు బిల్లులను చెల్లించాలని 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్ కోరారు.

⇨ కుక్కలు, కోతులు తదితర జంతువులకు అంటువ్యాధులు సోకాయని, అవి జనావాసాల్లో తిరుగుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, ఈ విషయమై చర్యలు చేపట్టాలని 47వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ కోరారు.

⇨ మార్చిలో రంజాన్ మాసం ప్రారంభం కానున్న తరుణంలో ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు.

⇨ ఎనిమిదో డివిజన్లో కరెంట్ తీగలతో సమస్యలు నెలకొన్నాయని, వీటిని పరిష్కరించాలని కార్పొరేటర్ కామాక్షిదేవి కోరారు. ఈ విషయమై సంబంధిత ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధికారులను సమాధానమివ్వాల్సిందిగా మేయర్ కోరారు. అయితే సదరు విభాగానికి సంబంధించిన ఎవరూ హాజరుకాకపోవడంతో విభాగాధికారికి షోకాజ్ నోటీస్‌ను జారీ చేయాలని కమిషనర్‌కు మేయర్ సూచించారు.

⇨ పారిశుధ్యంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించడంతో పాటు దోమల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని ఏడో డివిజన్ కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి కోరారు.

⇨ డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజవర్గ సమన్వయకర్తగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించడాన్ని తామంతా స్వాగతిస్తున్నామని 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. దీనికి కార్పొరేటర్లు హర్షధ్వానాలను తెలుపుతూ శుభాకాంక్షలను తెలియజేశారు.


డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్‌కు అభినందనలు

⇨ సమావేశ ప్రారంభానికి ముందే తోటి కార్పొరేటర్లతో పాటు పలువురు అధికారులను డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ కలిసి పలకరించి వెళ్లిపోయారు.

సీఎంకు కృతజ్ఞతలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్తగా తనకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ కృతజ్ఞతలను తెలియజేశారు. నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేయనున్న తనను ఆశీర్వదించాలని కోరారు. కమిషనర్ వికాస్ మర్మత్, అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ సంపత్‌కుమార్, సిటీ ప్లానర్ దేవీకుమారి, ఎంహెచ్ఓ వెంకటరమణ, మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్రవంతి

లెక్కలివీ..

2022 – 23లో ఆదాయం / ఖర్చులు:
ప్రారంభ నిల్వ రూ.107.45 కోట్లు, జమలు రూ.231.53 కోట్లు.. ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.338.98 కోట్లు, ఖర్చులు రూ.239.77 కోట్లు, అంత్య నిల్వ రూ.99.21 కోట్లు.

2023 – 24 బడ్జెట్ అంచనాలు:
ప్రారంభ నిల్వ రూ.116.61 కోట్లు, జమలు రూ.315.82 కోట్లు.. ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.432.44 కోట్లు, ఖర్చులు రూ.423.49 కోట్లు, అంత్య నిల్వ రూ.8.95 కోట్లు.

2023 – 24కు సవరించిన బడ్జెట్ అంచనాలు:
ప్రారంభ నిల్వ రూ.99.21 కోట్లు, జమలు రూ.232.67 కోట్లు.. ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.331.89 కోట్లు, ఖర్చులు రూ.219.02 కోట్లు, అంత్య నిల్వ రూ.112.86 కోట్లు.

2024 – 25 బడ్జెట్ అంచనాలు:
ప్రారంభ నిల్వ రూ.112.86 కోట్లు, జమలు రూ.332.01 కోట్లు.. ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.444.88 కోట్లు, ఖర్చులు 437.01 కోట్లు, అంత్య నిల్వ రూ.7.86 కోట్లు

రూప్‌కుమార్‌యాదవ్ పునరాలోచించుకోవాలి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): సామాన్య కార్యకర్త స్థాయి నుంచి డిప్యూటీ మేయర్ పదవిని కేటాయించి రూప్‌కుమార్‌యాదవ్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానాన్ని కల్పించిందని, నిర్ణయంపై పునరాలోచించుకొని తిరిగి పార్టీలోకి రావాలని పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు హంజా హుస్సేనీ పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. నట్టేట ముంచే పార్టీలోకి రూప్‌కుమార్ వెళ్తున్నారని, ఆయన్ను నమ్ముకున్న వారు మోసపోవడం ఖాయమని చెప్పారు. రూప్‌కుమార్ చర్యలతో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు చెడ్డపేరొచ్చిందని చెప్పారు. ముస్లింలకు సీటు ఇస్తే సంతోషపడాలి గానీ ఆయన తీసుకున్న నిర్ణయం ఏ పాటిదని ప్రశ్నించారు. మైనార్టీ, ఎస్సీ, ఎస్టీల ఆదరణతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని చెప్పారు. పార్టీ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

‘నారాయణ’లో ఎడ్యుఫెస్ట్

నెల్లూరు (టౌన్): రామలింగాపురంలోని నారాయణ స్కూల్లో ఎడ్యుఫెస్ట్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాజెక్ట్ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. లలితా శివజ్యోతి, పాఠశాల ఏజీఎం రమణారెడ్డి, డీన్ నరేంద్ర, ప్రిన్సిపల్స్ వెంగళరావు, సోనీ, రాఘవేంద్ర, వినీల్ పాల్గొన్నారు.

ఆదాలను భారీ మెజార్టీతో గెలిపించండి


ఎన్నికల ప్రచారంలో కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు


25వ డివిజన్లో..

నెల్లూరు(సెంట్రల్): ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా రూరల్ పరిధిలోని 26వ డివిజన్లో ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. పార్టీ డివిజన్ ఇన్‌చార్జిలు మల్లిబోయిన వెంకటేశ్వర్లు, షేక్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. రానున్న ఎన్నికల్లో ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలపించాలని కోరారు. పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, వేలూరు శ్రీధర్‌రెడ్డి, 27వ డివిజన్ ఇన్‌చార్జి సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, కొండా సాయిరెడ్డి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బారకాసు): రూరల్ పరిధిలోని 25వ డివిజన్లో ప్రచారాన్ని పార్టీ డివిజన్ ఇన్‌చార్జి నవాబ్ జాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఖాదర్‌బాషా, అమీర్‌జాన్, పాడమేకల శ్రీహరియాదవ్, షఫీ, హుస్సేన్, మురళి, జాహిద్, రాము, రవి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

⇨ 29వ డివిజన్ పరిధిలోని మహాత్మాగాంధీనగర్‌లో ఇంటింటి ప్రచారాన్ని కార్పొరేటర్ సత్తార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు.

⇨ 32వ డివిజన్లోని ఓల్డ్ ఎస్సీసీ కాలనీ, ఏ బ్లాక్‌లో ఇంటింటి ప్రచారాన్ని కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్ నిర్వహించారు. రజాక్, రెహ్మాన్, రియాజ్, గౌస్‌బాషా, ముజఫర్, సర్దార్, హఫీజ్, జావీద్, రిజ్వానా, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ కార్యకర్తకు పరామర్శ



నెల్లూరు(సెంట్రల్): టీడీపీ అల్లరి మూకల దాడిలో గాయపడి అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిట్టిబోయిన వెంకటేశ్వర్లును విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి బుధవారం పరామర్శించారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. చెన్నారెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, వీరపరెడ్డి నారాయణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నెల్లూరు పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభం



నెల్లూరు(బృందావనం): సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో బుధవారం ప్రారంభించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్రనామ పూజలు, అర్చనలను ప్రధానార్చకుడు రామావఝుల శ్రీనివాసశర్మ నిర్వహించారు. స్వామివారు చందనాలంకారంలో దర్శనమిచ్చారు. పల్లకిసేవ, పంచహారతులను జరిపారు. హరికథను భవానీబాయి నిర్వహించారు. ఉభయకర్తలుగా రాజేష్ కుమార్, నిత్యలక్ష్మి, సుజన, కల్పవల్లి, తేజవాణి, సాయిపార్వతి వ్యవహరించారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్తలు బాలాజీసింగ్, ధర్మసింగ్, ఈఓ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

‘శ్రీచైతన్య’లో సైన్స్ దినోత్సవం

నెల్లూరు (టౌన్): కామాక్షినగర్‌లోని శ్రీచైతన్య స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. పలు నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. పీఎమ్మార్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఏజీఎం కొండారెడ్డి, ప్రిన్సిపల్ సురేష్, డీన్ పెంచలబాబు, ప్రైమరీ ఇన్‌చార్జి కృపావతి తదితరులు పాల్గొన్నారు.

సీవీ రామన్‌కు నివాళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని ఆటోనగర్‌లోని ఏపీ గురుకుల పాఠశాలలో ఆయన చిత్రపటానికి బుధవారం నివాళులర్పించారు. అనంతరం సైన్స్ దినోత్సవం సందర్భంగా వివిధ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రిన్సిపల్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో గల జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవం, జేవీవీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అపోలో ఆస్పత్రి సమీపంలోని సీవీ రామన్ సైన్స్ సెంటర్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా కేఎన్నార్, ఆరెస్సార్ స్కూళ్లు, మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. రాయల్ నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన అలరించింది. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కాలేషా, శ్రీనునాయక్, కృష్ణారెడ్డి, రాము, విద్యాచరణ్, చలపతి, విజయ్‌కుమార్, సమతా, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన ఆన్‌లైన్ క్లెయిమ్‌ల పూర్తి


మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపు ఫారాలపై విచారణ జరిపి.. నివేదికలను ఉన్నత స్థాయి అధికారులకు పంపాలని కమిషనర్, నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎన్నికల సూపర్‌వైజర్లతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ ద్వారా అందిన 6, 7, 8 ఫారాలకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారించాలని ఆదేశించారు. సూపర్‌వైజర్ స్థాయిలో విచారణ పూర్తయిన దరఖాస్తులను ఏఈఆర్వో స్థాయికి బదిలీ చేయాలని సూచించారు. ఏఈఆర్వోలు దేవీకుమారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

నెల్లూరు(వీఆర్సీసెంటర్): టైలర్స్ డేను నెల్లూరు జిల్లా టైలరింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ట్రంక్‌రోడ్డులోని నిర్మల ఏజెన్సీస్ వద్ద అసోసియేషన్ జెండాను ఎగురవేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మదార్, నగర కార్యదర్శి యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో హుండీ కానుకలను లెక్కించారు. గతేడాది నవంబర్ 16 నుంచి బుధవారం వరకు కానుకల రూపంలో రూ.6,38,485 మేర భక్తులు సమర్పించారని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరావు, ఈఓ బొగ్గల మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈఓ శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు రమేష్‌యాదవ్, రాములమ్మ, పెంచలమ్మ, చిన్నా, దేవస్థాన ప్రధానార్చకుడు చంద్రశేఖర్, అర్చకులు దైవజ్ఞ, జయ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీ

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ హరినారాయణన్ ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. ఉలవపాడు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవిబాబును కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయ డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా.. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న చంద్రారెడ్డిని ఉలవపాడు తహసీల్దార్‌గా బదిలీ చేశారు.